సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం । 24 । డిసెంబర్ । 2023



భూపాలపల్లి అర్బన్: మంజూర్‌నగర్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బారులుదీరిన భక్తులు

న్యూస్‌రీల్

వినియోగదారుల చట్టంపై అవగాహన ఉండాలి

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



భూపాలపల్లి రూరల్: విద్యార్థులు వినియోగదారుల చట్టంపై అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం భూపాలపల్లి పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వినియోగదారుల రక్షణ చట్టం, వినియోగదారుల హక్కులు, వినియోగదారుల చైతన్యం, బాధ్యతలు, ఈ కామర్స్ డిజిటల్ వర్తకం గురించి వివరించారు. అనంతరం జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింగారావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దుచేయాలి

భూపాలపల్లి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న సీపీఎస్ విధానం రద్దు చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి డిమాండ్ చేశారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో యూనియన్ ఆధ్వర్యంలో శనివారం సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం నూతన పెన్షన్ విధానాన్ని వెంటనే రద్దు చేసి.. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. జీఓ నంబర్ 317ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత టీచర్లకు వెంటనే న్యాయం చేయాలని కోరారు. ఉపాధ్యాయ సంఘాలతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బానోతు సేవ నాయక్, గువ్వాడ జగపతిరావు పాల్గొన్నారు.

జాతర పోస్టర్ ఆవిష్కరణ



భూపాలపల్లి: నేడు, రేపు మహారాష్ట్రలోని సిరొంచలో జరిగే పూలే సాహు డాక్టర్ అంబేడ్కర్ జాతర పోస్టర్‌ను శనివారం జిల్లాకేంద్రంలో ఆవిష్కరించారు. బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు కోల శ్యామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఉపాసక్ మేకల శ్రీనివాస్ మాట్లాడారు. జాతరలో ప్రతి సంవత్సరం వేలాదిమంది అంబేడ్కర్ అభిమానులు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని అభిమానులు ఈ సారి జాతరను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ తిక్క వినోద్ కుమార్, ఉపాధ్యక్షుడు రామిల్ల రవి, జాయింట్ సెక్రటరీ జాడి అశోక్, ఎంపీ రావు, రాజేష్, ముద్దమల్ల భార్గవ్, శీల రత్న పాల్గొన్నారు.

సింగరేణి పోలింగ్ సిబ్బందికి శిక్షణ

భూపాలపల్లి అర్బన్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల పోలింగ్ సిబ్బందికి శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. లేబర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి(సెంట్రల్) శంకర్ హాజరై బ్యాలెట్ పేపర్, బ్యాలెట్ బాక్సుల గురించి అవగాహన కల్పించారు. అనంతరం కౌంటింగ్ సిబ్బందికి ఓట్లను లెక్కించే విధానంపై అవగాహన కల్పించారు. ఎన్నికలు, ఓట్ల లెక్కింపు కోసం 160మంది సిబ్బందిని నియమించినట్లు వివరించారు. కార్యక్రమానికి పర్యవేక్షకులుగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు హాజరై ఎన్నికల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా అధికార ప్రతినిధి తుకారం, అధికారులు క్రాంతికుమార్, శ్యాంప్రసాద్, సాధన్, సంజీవరావు, రవి, సాగర్ పాల్గొన్నారు.

జాతరలో పకడ్బందీగా భద్రత

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మ మహాజాతరలో పకడ్బందీగా భద్రత ఏర్పాట్లు చేపడుతామని ములుగు ఎస్పీ గాష్ ఆలం అన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే జాతరలో భక్తుల భద్రత ఏర్పాట్లపై ఎస్పీ గాష్ ఆలం జిల్లా అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. భక్తుల భద్రత ఏర్పాట్లపై ప్రధానంగా చర్చించారు.

ముక్కోటి మొక్కులు



ఉత్తర ద్వారదర్శనం, వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని శనివారం జిల్లావ్యాప్తంగా ప్రముఖ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నాలుగు గంటల నుంచే సుప్రభాత సేవలు ప్రారంభించి భక్తులను ఆలయాల్లోకి అనుమతించారు. జిల్లాకేంద్రంలోని వేంకటేశ్వరస్వామి, రామాలయం, హనుమాన్ దేవాలయాల్లో గోవిందనామస్మరణ మార్మోగింది. కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ అనుబంధ దేవాలయమైన శ్రీరామాలయంలో ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.


– భూపాలపల్లి అర్బన్

కాళేశ్వరం: శ్రీరామాలయంలోని పూలతో అలంకరించిన ఉత్సవ విగ్రహాలు



రేగొండ: మాడవీధుల గుండా ఊరేగుతున్న కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి

‘పార్లమెంట్’లో నెగ్గాల్సిందే..!



వరంగల్, మహబూబాబాద్ స్థానాలపై అన్ని పార్టీల గురి

- ప్రధాన పార్టీలలో మొదలైన కసరత్తు..
- అసెంబ్లీ ఫలితాలపైనా లోతైన విశ్లేషణ..2018, 2023 ఫలితాలపై అంతర్మథనం
- అభ్యర్థుల ఎంపికపై సాగుతున్న కసరత్తు
- వ్యూహాలకు పదును పెడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ

సాక్షిప్రతినిధి, వరంగల్: పార్లమెంట్ ఎన్నికల కోసం ప్రధాన రాజకీయ పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన, ఓడిన పార్టీలు ఎలాగైనా పార్లమెంట్ ఎన్నికల్లో గెలవాలన్న పట్టుదలతో ఉన్నాయి. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ.. ఎంపీ ఎన్నికల్లోనూ పై చేయి సాధించేందుకు ఇటీవల ఇన్‌చార్జ్‌లను నియమించింది. అధికారం కోల్పోయి అసెంబ్లీ ఫలితాలను విశ్లేషించిన బీఆర్ఎస్ వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఓటుశాతం పెంచుకోవడంపై దృష్టి పెట్టింది. మరోవైపు బీజేపీ పదాధికారుల భేటీలు నిర్వహిస్తోంది. పార్లమెంట్ ఎన్నికలకు ముందే బలం పెంచుకునే ప్రయత్నంలో ఉంది.

ఎవరి ధీమా వారిదే...

అభ్యర్థుల ఖరారుపై కసరత్తు..

ఉమ్మడి వరంగల్‌లోని రెండు పార్లమెంట్ స్థానాల్లో ఒకటి ఎస్సీ, మరోటి ఎస్టీలకు రిజర్వు చేసిన విషయం తెలిసిందే. వరంగల్ (ఎస్సీ), మహబూబాబాద్ (ఎస్టీ) స్థానాల్లోనూ బీఆర్ఎస్ నేతలు పసునూరి దయాకర్, మాలోతు కవిత పార్లమెంట్ సభ్యులుగా ఉన్నారు. ఈసారి ఈ రెండు స్థానాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఎవరికీ వారు గెలుపు ధీమాను వ్యక్తం చేస్తూ అభ్యర్థులను బరిలో దింపే యోచనలో ఉన్నారు. విజయోత్సాహంలో ఉన్న కాంగ్రెస్ మరింత దూకుడు పెంచి అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తోంది. టీపీసీసీ అధ్యక్షుడిగా రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి పార్టీని అధికారంలోకి తీసుకువచ్చి సీఎం అయిన రేవంత్ రెడ్డి పార్లమెంటు ఎన్నికలు కూడా ఆయన సారథ్యంలోనే నిర్వహించేందుకు అధిష్టానం నిర్ణయించినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వరంగల్ పార్లమెంటు పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా, ఈసారి స్టేషన్‌ఘన్‌పూర్ మినహా ఆరు స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించారు. మహబూబాబాద్ పార్లమెంటు పరిధిలోని ఏడు సెగ్మెంట్లలో భద్రాచలం తప్ప అన్నీ కాంగ్రెస్ వశమయ్యాయి. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో రెండు చోట్ల కాంగ్రెస్ ఓడిపోయింది. వరంగల్‌లో మొత్తం 10.61 లక్షల ఓట్లు పోలవ్వగా బీఆర్ఎస్ 6.12 లక్షల ఓట్లను పొంది విజయం సాధించింది. మహబూబాబాద్‌లో మొత్తం 9,83,707 ఓట్లు కాగా అందులో బీఆర్ఎస్ 4.61 లక్షలతో 46.98 శాతం ఓట్లను సాధించింది. ఈసారి ఈ రెండు పార్లమెంటు స్థానాల్లో బీఆర్ఎస్‌కు ఒక్కో అసెంబ్లీ స్థానం మాత్రమే దక్కాయి. దీంతో ఈసారి గట్టిగానే కృషి చేయాలనే పట్టుదలతో పార్టీవర్గాలు ఉన్నాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ వరంగల్, మహబూబాబాద్‌లలో కనీస పోటీ ఇవ్వలేకపోయింది. మహబూబాబాద్‌కు అసెంబ్లీ ఎన్నికల ముందు మోదీ వచ్చి ప్రచారం చేసినా ఆశించిన మేరకు ఓట్ల శాతం పెరగలేదు. ఈ నేపథ్యంలో ఆ పార్టీ నాయకత్వం సైతం సీరియస్‌గానే ఆలోచిస్తోంది.

అసెంబ్లీ ఫలితాలు బేరీజు..

అన్ని పార్టీల టార్గెట్ ‘లోక్‌సభ’..

రెండు పార్లమెంట్ స్థానాల పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. జనగామ అసెంబ్లీ నియోజకవర్గం ఉమ్మడి నల్లగొండ జిల్లా భువనగిరి పార్లమెంట్ కిందికి వస్తుంది. వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని 14 సెగ్మెంట్లలో 12 చోట్ల కాంగ్రెస్, రెండు చోట్ల బీఆర్ఎస్ గెలిచింది. 14 నియోజకవర్గాల పరిధిలో పొందిన ఓట్లను పరిగణలోకి తీసుకుంటే కాంగ్రెస్ 12,46,282 ఓట్లతో మొదటి స్థానంలో, 9,47,208 ఓట్లతో బీఆర్ఎస్ రెండోస్థానంలో నిలిచింది. 1,91,114 ఓట్లు బీజేపీ అభ్యర్థి సాధించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం మినహా బీజేపీ అన్ని సెగ్మెంట్లలో మూడో స్థానంలోనే ఉంది. మరికొద్ది రోజుల్లోనే పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గెలుపే లక్ష్యంగా అన్ని పార్టీలు దూకుడు పెంచాయి. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అనుకూలంగా రావడంతో ఊపులో ఉన్న కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌లను ఇటీవల నియమించింది. వరంగల్, మహబూబాబాద్‌లకు మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలకు అధిష్టానం అభ్యర్థుల గెలుపు బాధ్యతలు అప్పగించింది. మరోవైపు బీఆర్ఎస్ అధిష్టానం సైతం మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జ్‌లకు ఇటీవలే దిశానిర్దేశం చేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ఖరారులో ఆలస్యంతో ఆశించిన ఫలితాలు రాలేదని విశ్లేషిస్తున్న బీజేపీ.. ఈ సారి ముందుగానే ప్రకటించేందుకు సమావేశాలు నిర్వహిస్తోంది.

వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీలకు వచ్చిన ఓట్లు...

వరంగల్ పార్లమెంట్..

నియోజకవర్గం	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
స్టేషన్‌ఘన్‌పూర్(ఎస్సీ)	93,917	1,01,696	4,984
పాలకుర్తి	1,26,848	79,214	2,982
పరకాల	72,573	64,632	38,735
వరంగల్ పశ్చిమ	72,649	57,318	30,826
వరంగల్ తూర్పు	67,757	42,783	52,105
వర్ధన్నపేట(ఎస్సీ)	1,06,696	87,238	12,275
భూపాలపల్లి	1,23,116	70,417	14,731
మొత్తం	6,63,556	5,03,298	1,56,638

మహబూబాబాద్ పార్లమెంట్..

నియోజకవర్గం	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
డోర్నకల్(ఎస్టీ)	1,15,587	63,456	1,817
మహబూబాబాద్(ఎస్టీ)	1,16,644	66,473	17,083
నర్సంపేట	1,04,185	85,296	3,062
ములుగు	1,02,267	68,567	5,388
పినపాక	90,510	56,004	2,627
ఇల్లందు	1,09,171	51,862	2,568
భద్రాచలం	47,533	53,252	1,931
మొత్తం	5,76,726	4,43,910	34,476

అగ్రభాగాన సింగరేణి సంస్థ





మాట్లాడుతున్న జీఎం, ఉత్తమ అధికారులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

- జీఎం శ్రీనివాసరావు
- ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

భూపాలపల్లి అర్బన్: రాష్ట్రంలో సింగరేణి సంస్థ ఉత్పత్తి లక్ష్యాలను అధిగమిస్తూ అన్ని పరిశ్రమలతో పోలిస్తే అగ్రభాగాన ఉంటుందని ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. భూపాలపల్లి పట్టణంలోని అంబేడ్కర్ స్టేడియంలో శనివారం సాయంత్రం ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉత్పత్తి ఉత్పాదకతను పెంచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పట్టుదల, అంకితభావం, క్రమశిక్షణతో పనిచేస్తూ రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని సూచించారు. ప్రమాదాలు లేని సింగరేణిగా తీర్చిదిద్దాలని.. రాష్ట్రంలోని ప్రభుత్వ సంస్థలలో సింగరేణి సంస్థ అగ్రస్థానంలో నిలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఉత్పత్తిలో సింగరేణిలో భూపాలపల్లి ఏరియా అగ్రగామిగా ఉండేందుకు అందరి సమిష్టి కృషి ఉందన్నారు. రక్షణ పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ఉత్పత్తి చేయాలని అన్నారు. ఇంకా 45 సంవత్సరాలకు సరిపడా నిల్వలు ఉన్నట్లు తెలిపారు. భూపాలపల్లి ఏరియాలో తాడిచర్ల, వెంకటాపూర్ బ్లాక్‌లు రానున్నాయన్నారు. ఏరియాకు సుదీర్ఘ భవిష్యత్ ఉందన్నారు. సంస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. సింగరేణి వ్యాప్తంగా ఈ ఏడాది 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, భూపాలపల్లి ఏరియాకు 40లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించినట్లు చెప్పారు. ఇప్పటివరకు 64శాతం బొగ్గు ఉత్పత్తి చేశామన్నారు. మిగిలిన మూడు నెలల కాలంలో లక్ష్యాన్ని అధిగమించేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు వివరించారు. రోజుకు 13వేల టన్నుల టార్గెట్ లక్ష్యంగా ముందుకుపోతున్నట్లు తెలిపారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఘనంగా వేడుకలు..

సింగరేణి 135వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం భూపాలపల్లి ఏరియాలో ఘనంగా నిర్వహించారు. సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జీఎం కార్యాలయం, అంబేడ్కర్ స్టేడియంలో జీఎం శ్రీనివాసరావు సింగరేణి పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జీఎం శ్రీనివాసరావు, సేవా అధ్యక్షురాలు బళ్లారి మాధవి శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరై వివిధ డిపార్ట్‌మెంట్‌లు, సేవాసమితి సభ్యులతో ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్లు, ఫుడ్ కోర్టులను రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. వివిధ పాఠశాలల చిన్నారులు, ప్రైవేట్ డాన్సర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలు చేశారు. అనంతరం ఉత్తమ ఉద్యోగులు, సేవా సభ్యులు, క్రీడాకారులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు జోతి, వెంకటరామిరెడ్డి, అజ్మీర తుకారం, కవీంద్ర, రవికుమార్, రామకృష్ణారెడ్డి, కుమారస్వామి, సురేఖ, రాజు, క్రాంతికుమార్, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

దేవుడిపై రాజకీయం విడ్డూరం

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలో నిర్మాణం చేపడుతున్న వేంకటేశ్వరస్వామి ఆలయంపై రాజకీయం చేయడం విడ్డూరంగా ఉందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బహిరంగంగా ఏడాది నుంచి చేపడుతున్న వేంకటేశ్వరస్వామి ఆలయం, ఆలయానికి అనుబంధ భవనాలకు రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు నోటీసులు జారీ చేయడం సరైనది కాదన్నారు. తాను సొంత అవసరాల కోసం నిర్మాణాలు చేపట్టడం లేదని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆలయం, ఆలయంలో పనిచేసే పూజారులు, సిబ్బంది నివాసం కోసం భవన నిర్మాణాలు చేపడుతున్నట్లు వివరించారు. ఆలయ ప్రతిష్ఠాపనలో కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ సైతం పాల్గొన్నారని చెప్పారు. భూ వివాదం, కోర్టులో కేసు ఉందన్న విషయం తన దృష్టికి రాలేదన్నారు. అధికారులకు ఇప్పుడు కనిపించిందా అని ప్రశ్నించారు. అధికార పార్టీ నాయకులు రాజకీయం చేయాలంటే ప్రజాసమస్యలపై చేయాలని సూచించారు. లేదంటే తనపై చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి సిద్దు, నాయకులు జోరుక సదయ్య, దేవేందర్‌రెడ్డి, రాజు, రవి, మల్లేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

విద్యార్థుల ఉత్తీర్ణతకు కృషి చేయాలి



ప్రదర్శనను తిలకిస్తున్న డీఈఓ రాంకుమార్



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

- డీఈఓ రాంకుమార్

కాటారం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు అంకితభావంతో కృషిచేయాలని జిల్లా విద్యాధికారి రాంకుమార్ తెలిపారు. కాటారం మండలం చింతకాని ప్రభుత్వ పాఠశాలను శనివారం డీఈఓ తనిఖీ చేశారు. విద్యాబోధన, విద్యార్థుల ఉత్తీర్ణతపై ఆరాతీశారు. విద్యార్థుల భవిష్యత్ కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకొని విద్యాబోధన చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని పేర్కొన్నారు. హైస్కూల్స్‌లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉన్నతి కార్యక్రమాన్ని పటిష్టంగా అమలుచేయాలని విద్యార్థులకు గుణాత్మకమైన విద్య అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యాబోధనపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. డీఈఓ వెంట సెక్టోరల్ అధికారి లక్ష్మణ్, అసిస్టెంట్ కార్యదర్శి శనిగరపు భద్రయ్య ఉన్నారు.

గ్రీన్‌వుడ్‌లో వైజ్ఞానిక ప్రదర్శన

మహదేవపూర్: మండలకేంద్రంలోని గ్రీన్‌వుడ్ పాఠశాలలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనకు డీఈఓ రాంకుమార్ హాజరై మాట్లాడారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయడం ద్వారా భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా ఎదుగుతారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ భద్రయ్య, ఏఎస్‌ఓ లక్ష్మణ్, సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై రాజ్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చీర్ల శ్రీనివాసరెడ్డి, రాజ్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలను ఆచరించాలి

- కలెక్టర్ భవేష్‌మిశ్రా
- అన్ని మతాలకు సమాన గౌరవం
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: క్రీస్తు బోధనలైన శాంతి, ప్రేమ మార్గాలను పాటిస్తూ ప్రజలందరూ ప్రశాంతంగా జీవనం సాగించాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా అన్నారు. భూపాలపల్లి పట్టణం మంజూర్‌నగర్‌లోని కల్వరి చర్చిలో శనివారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రిస్మస్ వేడుకలలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి కలెక్టర్ భవేష్‌మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్‌చేసి ప్రజలకు గిఫ్ట్ ప్యాక్‌లు పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ భవేష్‌మిశ్రా మాట్లాడుతూ.. జిల్లాలో మూడవసారి క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం తనకు సంతోషంగా ఉందన్నారు. జిల్లాలోని పేద క్రైస్తవులకు ప్రభుత్వం తరఫున గిఫ్ట్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నామని అన్నారు. క్రైస్తవ ప్రార్థన స్థలాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. క్రైస్తవ శ్మశాన వాటిక కోసం అవసరమైన మేర భూ కేటాయింపు ప్రక్రియ చేపట్టామని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ.. క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రతి నియోజకవర్గానికి వెయ్యి గిఫ్ట్ ప్యాక్‌లు కేటాయించినట్లు చెప్పారు. భూపాలపల్లి నియోజకవర్గంలో అదనంగా మరో వెయ్యి గిఫ్ట్ ప్యాక్‌లను అందిస్తామన్నారు. మతాల పేరిట.. కులాల పేరిట ప్రజలను విడగొడుతూ రెచ్చగొట్టే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. దేవాలయాల, మజీదు, చర్చిల స్థలాలను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, శైలజ, సామ్యూల్, ఆశాలత, విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ అనిల్‌కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, ముంజాల రవీందర్, ప్రజాప్రతినిధులు, పాస్టర్లు పాల్గొన్నారు.



భూపాలపల్లి రూరల్: పేదలకు క్రిస్మస్ గిఫ్టులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

ప్రభుత్వ ఉద్యోగులకు అండగా ఉంటా..

భూపాలపల్లి అర్బన్: ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓస్ భవనంలో శనివారం జరిగిన టీఎన్‌జీఓస్ జిల్లా స్టాండింగ్ కౌన్సిల్ సమావేశానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని తెలిపారు. ఉద్యోగులు సూచించిన 10 డిమాండ్లను మరోసారి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోనున్నట్లు వివరించారు. ప్రతి నెల 1వ తేదీనే వేతనాలు అందించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిపారు.



భూపాలపల్లి అర్బన్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

ఉద్యోగుల కృషితోనే..

జిల్లాలోని ప్రతి ఉద్యోగి కృషితోనే అన్ని రంగాల్లో ముందుకు పోతున్నామని పలు విభాగాల్లో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నుంచి మొదటి స్థానంలో ఉన్నట్లు కలెక్టర్ భవేష్‌మిశ్రా తెలిపారు. టీఎన్‌జీఓస్ కార్యాలయం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బూరుగు రవి, రాష్ట్ర, జిల్లా నాయకులు జగదీశ్వర్, సత్యనారాయణగౌడ్, శ్రీనివాసరావు, దశరథం, సురేందర్‌రెడ్డి, అన్వరుల్లా, వంశీకృష్ణ, వేణు, సాగర్, భార్గవ్, సత్యనారాయణ, శ్రీదేవి, ప్రవీణ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌ను కలిసిన యశ్వంత్



గవర్నర్‌కు ఆల్బమ్ అందజేస్తున్న యశ్వంత్

మరిపెడ రూరల్: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్యతండాకు చెందిన మౌంటెయినర్ భూక్యా యశ్వంత్ శనివారం ఛత్తీస్‌గఢ్ గవర్నర్ బిశ్వభూషణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. ఇటీవల ఆస్ట్రేలియాలోని ఎత్తైన కోజిస్కోన్ పర్వతాన్ని అధిరోహించి శిఖరంపై భారతదేశ పతాకం ఎగరవేసినట్లు గవర్నర్‌కు వివరించారు. అలాగే, త్వరలో ప్రపంచంలోనే ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించనున్నట్లు గవర్నర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా గవర్నర్ బిశ్వభూషణ్.. యశ్వంత్‌ను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి భారత దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటాలని ఆకాంక్షించారు.

ఉచ్చులో పడి విద్యుత్ ఉద్యోగులకు గాయాలు



చికిత్స పొందుతున్న లైన్‌మెన్

ఏటూరునాగారం: వన్యప్రాణుల కోసం వేటగాళ్లు అమర్చిన ఉచ్చులో పడి విద్యుత్ ఉద్యోగులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఏటూరునాగారం మండలం ముళ్లకట్ట వద్ద చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి ముళ్లకట్ట వద్ద బ్రేక్‌డౌన్ (విద్యుత్ తీగ తెగడం) అయింది. దీనిపై సమాచారం అందుకున్న కన్నాయిగూడెం లైన్‌మెన్ పల్లెబోయిన రవి, వెంకటాపురం(కె) జేఎల్‌ఎం దిలీప్ ఘటనాస్థలికి చేరుకున్నారు. అయితే అప్పటికే అక్కడ వన్యప్రాణుల కోసం వేటగాళ్లు విద్యుత్ తీగలకు ఉచ్చు అమర్చారు. ఇది గమనించని విద్యుత్ సిబ్బంది ఉచ్చులో పడడంతో విద్యుత్ షాక్ తగిలింది. దీంతో వారికి తీవ్రగాయాలు కావడంతో సిబ్బంది ఏటూరునాగారం ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలించినట్లు విద్యుత్‌శాఖ ఏటూరునాగారం ఏఈ అశోక్ తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏఈ పేర్కొన్నారు.

పాకాల సోయగం..



వరంగల్ జిల్లా నర్సంపేట సమీపంలోని కొత్తగుడెం రహదారిలో రమణీయ నీటి సరస్సు పాకాల. ఇక్కడ పచ్చని చెట్లు, పూల మొక్కలు, చల్లటి నీడలో పర్యాటకులు సేదదీరుతుంటారు. అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చిల్డ్రన్స్ పార్క్ మరింత ఆహ్లాదంగా కనిపిస్తుంది. సువిశాల సరస్సులో బోటు షికారు చేస్తూ ప్రకృతిని ఆస్వాదించొచ్చు. మరికొంత మంది తూము వద్ద స్నానాలు చేస్తూ సందడి చేస్తుంటారు.

లక్నవరం అందాలు..




ములుగు జిల్లా చల్వాయిలోని గుట్టల మధ్య సువిశాల లక్నవరం నీటి సరస్సు ఉంటుంది. ఇక్కడ అలలు సముద్రాన్ని తలపించేలా ఎగిసిపడుతుంటాయి. సరస్సు మధ్య దీవులు ఉన్నాయి. ఈ దీవులకు వెళ్లేందుకు పర్యాటక శాఖ తీగల వంతెన ఏర్పాటు చేసింది. దీంతో పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో చేరుకుని రోజంత వీక్షించి ఆహ్లాదంగా గడిపి వెనుదిరుగుతుంటారు.

వరుస సెలవులు.. చూసొద్దాం రండి..

ఆధ్యాత్మిక, ఆహ్లాదకరంగా విలసిల్లుతున్న ఉమ్మడి వరంగల్ జిల్లా | స్వాగతిస్తున్న లక్నవరం ప్రకృతి అందాలు..

- సజీవ సాక్ష్యంగా కాకతీయ కట్టడాలు
- పిల్లలకు ఆహ్లాదంతోపాటు చారిత్రక విశేషాలు తెలుసుకునే అవకాశం

తరగతి గదుల్లో పుస్తకాలతో నిత్యం కుస్తీ పట్టే విద్యార్థులకు సెలవులు వచ్చాయంటే ఎగిరి గంతేస్తారు. అయితే నిర్దిష్ట లక్ష్యాలతో చదువుతున్న విద్యార్థులకు కాస్తా మానసిక ఉల్లాసం లభించాలంటే కొత్త పర్యాటక ప్రాంతాలు సందర్శించాల్సిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం విద్యాసంస్థలకు ఆది, సోమ, మంగళవారం వరుసగా మూడు రోజులు క్రిస్మస్ సెలవులు ప్రకటించింది. దీంతో విద్యార్థులు అమ్మమ్మగారింటికి, పర్యాటక ప్రాంతాలు, ఆధ్యాతిక ప్రదేశాలకు బయలుదేరుతున్నారు. ఈ పర్యటనతో వారిలో ఆహ్లాదంతోపాటు పలు చారిత్రక విశేషాలు తెలుసుకునే అవకాశం ఉంది. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రధానంగా వరంగల్ కోట, పాకాల, రామప్ప, లక్నవరం, మేడారం, మంగపేటలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, పాండవుల గుట్టలు, కోటగుళ్లు, ఐనవోలు మల్లికార్జునస్వామివారి ఆలయం, కొమురెల్లి, కురవి వీరభద్రస్వామి ఆలయం, చిల్పూరు గుట్ట, పాలకుర్తి సోమేశ్వరాలయం, జైనమందిరం, తదితర పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. ఇతర జిల్లాలోని వేములవాడ, యాదగిరి గుట్ట, హైదరాబాద్‌లోని బిర్లా టెంపుల్, వండర్ లా, సమతామూర్తి ఆశ్రమం, రామోజీ ఫిలిం సిటీ, తదితర ప్రాంతాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయా పర్యాటక ప్రాంతాలు, వాటి విశిష్టత, తదితర వివరాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం. -ఖిలా వరంగల్



పర్యాటక కేంద్రంగా ఓరుగల్లు

కాకతీయుల రాజధాని ఖిలావరంగల్ కోట ప్రపంచ పర్యాటక కేంద్రంగా విలసిల్లుతోంది. పిచుకల కీచుకీచులు.. కోకిల రాగాల మధ్య కోట.. పర్యాటకులను స్వాగతిస్తోంది. కాకతీయులు శకం ముగిసి 800 ఏళ్ల పూర్తయినా నేటికీ కోట చారిత్రక కట్టడాలు కళ్ల ముందు కదలాడుతున్నాయి. నాలుగు కీర్తి తోరణాల మధ్య స్వయంభూశంభు లింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం చరిత్రకు నిలువెత్తు సాక్షిగా నిలుస్తోంది. నల్ల రాతిలో నాటి శిల్పులు చెక్కిన అద్భుత కళా ఖండాలు, కళా సంపద దర్శనమిస్తుంది. నాటి ఆనవాళ్లు నేటికీ సజీవంగా నిలిచి ఉన్నాయి. తొలుత సందర్శకులకు రాతి, మట్టికోటలు దర్శన మిస్తాయి. కోటలో ప్రవేశించగానే శిల్పాలకు ఇరువైపులా పచ్చని పంటపొలాలు, వివిధ అకుకూరల తోటలు, మొక్క జొన్న, బంతి తోటలు పర్యాటకులను స్వాగతిస్తాయి. ఖుష్‌మహల్, ఏకశిలా గుట్టపై నుంచి చూస్తే త్రీనగరం పూర్తిగా కళ్లముందు కదలాడుతుంది. దీనికి తోడు ఏకశిలా చిల్డ్రన్ పార్క్, గుండు చెరువులో బోటింగ్ సౌకర్యాలు, ఏకశిలా గుట్ట పలువురి మనసులు దోచుకుంటోంది.



మధ్యకోటలో శిల్పాల ప్రాంగణం

రమణీయం.. రామప్ప ఆలయం.



కాకతీయుల పాలనలో రామప్ప గుడి నిర్మాణం జరిగింది. నాటి శిల్పులు నల్ల రాతిలో చెక్కిన అద్భుత కళారూపాలు, శిల్ప సౌందర్యం చూపరులను ఆకట్టుకుంటుంది. శిల్ప కళా రూపాల్లోనించి సప్తస్వరాలు పలికించే కళాఖండాలను చేతులతో తడుముతూ సంపదను వీక్షిస్తుంటారు. శిల్పాల్లో భారీ నందీశ్వరుడి విగ్రహం ప్రతిష్ఠించారు. శివుడి ఆజ్ఞ కోసం ఎదురుచూస్తున్నట్లు నందీశ్వరుడు దర్శనమిస్తాడు. ఈ విగ్రహం ఎటు నుంచి చూసిన మనవైపే చూస్తున్నట్లు కనిపిస్తుండడం విశేషం. నందీశ్వరుడి తల, చేతి గోరు తడిమితే తోక వద్ద స్వష్ట స్వరాలు వినిపిస్తాయి.

హైదరాబాద్ టూర్ ప్లాన్ చేశాం



బంధువులతో కలిసి ముందుగానే హైదరాబాద్ టూర్ ఫిక్స్ చేశాం. పిల్లలకు ఆది, సోమ, మంగళవారం మూడురోజులు సెలవురావడంతో కారులోనే హైదరాబాద్ వెళ్తున్నాం. హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో నిర్మించిన సమతామూర్తి ఆశ్రమాన్ని దర్శించుకుంటాం. అక్కడి నుంచి రామోజీ ఫిలిం సిటీ వెళ్తాం. తిరుగు ప్రయాణంలో యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి వారిని దర్శించుకుంటాం.

మునుగోటి శ్రీలత, వరంగల్

భద్రాచలం వెళ్తున్నాం



మానసిక ప్రశాంతత కోసం కుటుంబ సమేతంగా భద్రాచలం వెళ్తున్నాం. ధనుర్మాసంలో సీతారామచంద్రస్వామి దర్శించుకుంటే పుణ్యం. పాఠశాలకు మూడు రోజుల సెలవులు రావడంతో పిల్లలు, బంధువులతో కలిసి భద్రాచలం వెళ్తున్నాం. తరువాత బోటులో పాపికొండలకు వెళ్తాం. తిరుగు ప్రయాణంలో కిన్నెరసాని డ్యామ్, సరస్సు చూస్తాం.

ముద్దసాని సత్యనారాయణరెడ్డి, వరంగల్

యేసయ్య స్మరణలో..

- గ్రామాల్లో క్రిస్మస్ సందడి
- ముస్తాబైన చర్చిలు
- నేటి రాత్రి నుంచి ఆరాధనలు ప్రారంభం

చెన్నారావుపేట : యేసు క్రీస్తు జన్మదిన వేడుకలకు జిల్లాలోని పలు చర్చిలు ముస్తాబయ్యాయి. విద్యుత్ దీపాలు, క్రిస్మస్ స్టార్‌లు, ట్రీలు కనువిందు చేస్తున్నాయి. దీంతో గ్రామాల్లో సందడి నెలకొంటోంది. కాగా, వరంగల్ జిల్లాలోని అతిపెద్ద చర్చి అయిన చెన్నారావుపేట మండలం తిమ్మరాయిని పహాడ్ చర్చికి భక్తులు పోటెత్తుతారు. సుమారు 1500 పైగా భక్తులు హాజరవుతారు.

నవంబర్ 25 నుంచే క్రిస్మస్ వేడుకలు

నవంబర్ 25 నుంచి ఆగమన కాల ప్రకారం క్రైస్తవులు పూజాబలి కార్యక్రమాలు నిర్వహిస్తారు. నెల రోజులు నిర్వహించే ఈ కార్యక్రమాల ద్వారా పూనవుడు వ్యక్తిగత జీవితంలో చేసిన లోటుపాట్లను సవరించుకోవడం, నూతన వ్యక్తిత్వం పెంపొందించుకోవడానికి ప్రార్థనలు చేస్తారు. అంతే కాకుండా ఇంటింటికి వెళ్తూ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వాదాలు అందిస్తారు. క్రిస్మస్ తాత వేషధారణతో పేదలకు బహుమతులు అందిస్తారు.



క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైన తిమ్మరాయినిపహాడ్ చర్చి

ప్రపంచ శాంతికి ప్రత్యేక ప్రార్థనలు



యేసుక్రీస్తు.. సర్వమానవాళికి ప్రేమ, దయ, జాలి, కరుణ, సమాదానం ఇవ్వడానికే జన్మించారు. క్రీస్తు పుట్టిన రోజు వేడుకలు ప్రతీ సంవత్సరం డిసెంబర్ 25న ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా జరుగుతాయి. ఈ సందర్భంగా చర్చిలను సుందరంగా అలంకరిస్తారు. ఈనెల 24న అర్ధరాత్రి నుంచి శాంతి సందేశం అందిస్తారు. ప్రపంచ శాంతి, మానవాళి రక్షణకు ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.

తుమ్మ యాగారెడ్డి, విచారణ గురువు

గంటకు ఘన చరిత్ర..

- సెంటినరీబాప్టిస్ట్ చర్చిలో వందేళ్లకు పైబడిన బెల్

హన్మకొండ కల్చరల్ : హనుమకొండలోని సెంటినరీబాప్టిస్ట్ చర్చిలో ఉన్న బెల్ (గంట)కు వంద సంవత్సరాలకు పైబడిన ఘనచరిత్ర ఉంది. స్వాతంత్య్ర ఉద్యమ చైతన్యంతో అమెరికాలో ఎంతో శాస్త్రసాంకేతిక, పారిశ్రామిక అభివృద్ధి జరిగింది. పారిశ్రామిక చైతన్యం పెంపొందించిన వారిలో బెంజిమెన్ హంక్స్ ఒకరు. ఇతడు అమెరికా సైన్యంలో డ్రమ్మర్‌గా విధులు నిర్వర్తించేవాడు. అలాగే, లిచ్‌ఫీల్డ్‌లో మొదట తన కర్మాగారం ప్రారంభించి చర్చి బెల్స్ తయారు చేశాడు. తరువాత తన కుమారుడు జ్యూలియస్‌హంక్స్‌తో కలిసి మ్యాన్స్‌ఫీల్డ్, వెస్ట్ రాయ్‌లలో పెద్ద కర్మాగారాలు స్థాపించాడు. ఇక్కడ అప్రెంటీస్‌గా చేరిన అండ్రిమేన్‌లీ.. బెంజిమెన్‌హంక్స్ మనవరాలిని పెళ్లి చేసుకుని ఆ తరువాత న్యూయార్క్‌లోని గిబ్బన్స్‌విల్లేలో తన సొంత కర్మాగారం ఏర్పాటు చేశాడు. తరువాత అండ్రిమేన్‌లీ మూడో కుమారుడు 1870లో పాయిల్ నది ఒడ్డున మేన్‌లీ బెల్ కంపెనీని స్థాపించాడు. ఈ బెల్ కంపెనీ 1952 వరకు పని చేసింది. 1883లో వీరు ఎక్కువ సంఖ్యలో బెల్స్‌ను తయారుచేశారు. ఆ విధంగా తయారైన బెల్‌ను 1983లో వరంగల్‌కు తీసుకొచ్చి హనుమకొండ సెంటినరీబాప్టిస్ట్ చర్చిలో ఏర్పాటు చేశారు. కాగా, ఇక్కడ ఏర్పాటు చేసిన చర్చి బెల్‌ను మేన్‌లీ అండ్ కంపెనీ తయారు చేసింది.



హన్మకొండ సెంటినరీబాప్టిస్ట్ చర్చిలో ఏర్పాటు చేసిన బెల్

122 ఏళ్లుగా క్రీస్తు సేవలో..

- చరిత్రకు సజీవ సాక్ష్యం జనగామ ఉండ్రుపుర చర్చి

జనగామ: జనగామ ఉండ్రుపుర సెంటనరీ బాపిస్టు చర్చి 122 ఏళ్లుగా యేసుక్రీస్తు సేవలో తరిస్తోంది. 1901లో స్థాపించిన ఈ చర్చి.. అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ జిల్లాలో తల్లిసంఘం చర్చిగా విలసిల్లుతోంది. రష్యా చెందిన దంపతులు అన్న ఉన్రు(భార్య), హెర్నీ ఉన్రు(భర్త) అనేక దేశాలు పర్యటిస్తూ, జనగామకు చేరుకున్నారు. 1901 నుంచి 1975లో ప్రెస్టన్ ఇన్‌స్టిట్యూట్ నుంచి చర్చి సేవలు, ప్రార్థనలు కొనసాగించగా, ఆ తర్వాత ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా (ప్రస్తుతం) మార్చారు. 1912లో హెర్నిఉన్రు మృతి చెందగా, అన్న ఉన్రు 1921లో రష్యాలో మృతి చెందారు. ఉన్రు పెద్ద కూతురు తండ్రితోనే జనగామలో ఉంటూ సేవకార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె కూడా మృతి చెందడంతో ప్రెస్టన్‌లోని తండ్రి సమాధి పక్కనే ఖననం చేశారు.



ఉండ్రుపుర చర్చి

2002లో నూతన చర్చి ప్రారంభం

2000 సంవత్సరంలో నూతన భవన నిర్మాణం కోసం భూమిపూజ చేసి, 2002లో చర్చిని ప్రారంభించారు. 2005లో అప్పటి ముఖ్యమంత్రి, మహానేత దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా ఉండ్రుపుర సెంటనరీ బాపిస్టు చర్చిని ప్రారంభించారు. ప్రస్తుతం డాక్టర్ పాలమాకుల పిలిప్ పాస్టర్‌గా సేవలందిస్తున్నారు.

40 అడుగుల క్రిస్మస్ ట్రీ, ఇటలీ పశువుల పాక

- శోభాయమానంగా కరుణాపురం చర్చి

ధర్మసాగర్/కాజీపేట రూరల్: ధర్మసాగర్ మండలం కరుణాపురంలో అపురూప కట్టడంగా పేరుగాంచిన క్రీస్తుజ్యోతి ప్రార్థన మందిరం క్రిస్మస్ పండుగకు ముస్తాబైంది. చర్చి వ్యవస్థాపకులు, అంతర్జాతీయ దైవజనులు రెవరెండ్ డాక్టర్ సంగాల పాలస్‌రాజ్, గోపు జయప్రకాష్ ఆధ్వర్యంలో క్రిస్మస్ పండుగ ఏర్పాట్లు చేస్తున్నారు. రంగు రంగుల విద్యుత్ కాంతులతో చర్చిని అలంకరించారు. ఇప్పటికే చర్చిని తిలకించేందుకు దేశ నలుమూలల నుంచి అనేకమంది సందర్శకులు వస్తున్నారు. ఇజ్రాయల్ దేశంనుంచి తెచ్చిన 1600, 600, 100 ఏళ్ల నాటి ఒలీవ చెట్లు ఆకర్షణీయంగా దర్శనమిస్తున్నాయి. ఈ సందర్భంగా పాల్సన్‌రాజ్, జయప్రకాష్ మాట్లాడుతూ చర్చి నిర్మాణం తర్వాత మొదటిసారి జరిగే క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని 24వ తేదీ రాత్రి క్యాండిలైట్ సర్వీస్, 25న క్రిస్మస్ పండుగ రోజు ఊరేగింపు, ప్రత్యేక క్రిస్మస్ గీతాలు ఉంటాయని తెలిపారు. ప్రాంగణంలో 40 ఫీట్లతో క్రిస్మస్ ట్రీ, ఇటలీనుంచి తెచ్చిన సెట్టుతో పశువుల పాకను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పండుగ రోజు 20 వేల మందికి భోజనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



చర్చి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పశువుల పాక

రైతులకు న్యాయం చేయాలి

- తెలంగాణ రైతు సంఘం సలహాదారుడు వెంకటనారాయణ



మాట్లాడుతున్న వెంకట నారాయణ

హన్మకొండ: సన్న, చిన్నకారులు, కౌలు రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయాలని తెలంగాణ రైతు సంఘం సలహాదారుడు ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ అన్నారు. ఈ మేరకు శనివారం హనుమకొండ బాలసముద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పది సంవత్సరాల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రంలో 8000 మందికి పైగా కౌలు, సన్న, చిన్న కారు రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుబంధు ద్వారా రూ.65 వేల కోట్లు పంపిణీ చేసినప్పటికీ... ఇందులో రూ.40 వేల కోట్లు సొమ్ము భూస్వాములు, కార్పొరేట్ సంస్థల యజమానులు, రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ దిగ్గజాలు, జమీందారులకు మాత్రమే చేరిందని వివరించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం చిన్న, సన్న కారు, కౌలు రైతులకు న్యాయం జరిగేలా విధానాలు రూపొందించాలన్నారు. వ్యవసాయ మార్కెట్లలో అవినీతి జరగకుండా నియంత్రించాలన్నారు. అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని, రైతు రుణాలు మాఫీ చేసి చిన్న, సన్నకారు రైతులను రుణ విముక్తులను చేయాలని కోరారు. వివిధ పంటలకు గిట్టుబాటు ధర అందించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్నదాతల ఆత్మహత్యలు ఉండొద్దని, రైతు సంక్షేమం వర్థిల్లాలని ఆకాంక్షించారు. సమావేశంలో రైతు నాయకులు సోమిరెడ్డి శ్రీనివాస్, వొడెల రాజన్న, సిరుల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఇసుక లారీ

- ఒకరి మృతి..మరొకరికి తీవ్ర గాయాలు



భిక్షపతి(ఫైల్)

ములుగు : ములుగు జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి ఇసుకలారీ.. బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం ములుగు మండలం చింతలపల్లికి చెందిన మామిడిపల్లి భిక్షపతి(35), ఎనగందుల నరేష్.. బైక్‌పై పోలీస్ స్టేషన్ ఎదుట రోడ్డు క్రాస్ చేస్తున్నారు. ఈ క్రమంలో హనుమకొండ నుంచి ఏటూరునాగారం వైపునకు అతివేగంగా వెళ్తున్న ఇసుక లారీ.. బైక్‌ను ఢీకొంది. దీంతో భిక్షపతి అక్కడికి అక్కడే మృతిచెందారు. నరేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. దీంతో స్థానికులు వెంటనే నరేష్‌ను ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై మృతుడు నరేష్ భార్య సుకన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లుఉ ఎస్సై రామకృష్ణ తెలిపారు. కాగా, లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

రేణుక అంత్యక్రియలు పూర్తి



రేణుక మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

ఏటూరునాగారం: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం పెంచికలపేట వద్ద శుక్రవారం తెల్లవారుజామున కారు, లారీ ఢీకొన్న ఘటనలో మృతి చెందిన మండల కేంద్రానికి చెందిన మంతెన కాంతయ్య భార్య రేణుక అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య శనివారం పూర్తయ్యాయి. ఎంజీఎంలో శుక్రవారం రాత్రి వరకు ప్రాణాలతోపోరాడిన ఆమె చివరకు తుదిశ్వాస విడిచారు. దీంతో మృతదేహాన్ని ఏటూరునాగారం తరలించి దహన సంస్కారాలు నిర్వహించారు. కాగా, ఈ ఘటనలో కాంతయ్య, అతడి భార్య రేణుక, కుమార్తె రాధిక చందన మృతి చెందారు. దీంతో రేణుక మృతదేహానికి తన సోదరి కుమారుడు తలకొరివి పెట్టారు. మృతదేహం వద్ద బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకుల మర్రి లక్ష్మీనర్సింహారావు, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, సర్పంచ్ ఈసం రామ్మూర్తి, ఇతర నాయకులు మృతురాలి కుటుంబానికి అండగా నిలిచారు. రేణుక దహన సంస్కారాలకు సహకరించారు. నాయకులు రఘు, సునీల్, వెంకన్న, రాము, ప్రమోద్, ఎల్లయ్య పాల్గొన్నారు.

భర్త హత్య కేసులో భార్య అరెస్టు

మహబూబాబాద్ రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో భర్తను హత్య చేసిన కేసులో భార్య అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని మహబూబాబాద్ టౌన్ సీఐ వై.సతీష్ శనివారం తెలిపారు. మహబూబాబాద్ పట్టణంలోని బెస్తబజార్‌లో నివాసం ఉండే ఆటో డ్రైవర్ షేక్ యూసుఫ్ అక్టోబర్ 14వ తేదీన మృతి చెందాడు. యూసుఫ్ మృతిపై అనుమానం ఉందని మృతుడి సోదరి ఖతీజా పోలీసులకు ఫిర్యాదు చేయగా టౌన్ సీఐ వై.సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో యూసుఫ్ మృతికి అతడి భార్య మహబూబీ కారణమని తేలింది. దీంతో మహబూబీని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.